# ★ సోమశేఖరశాస్త్రి ★

రాయసం వెంకటశివుడు

★

లోక మందలి సర్వ సామాన్య విషయములె నాకు సంతోషదాయకములు. నడచువారినయనము లాకర్షింపక దారిప్రక్కను బెరుఁగుచుండెడి తుమ్మచెట్టు తీయమామిడి కంటెను, గొబ్బిపూవు గులాబి కంటెను, నాకుఁ బ్రియతరము. మాపూర్వు లొకరు "వేపశతకము" వ్రాసి వేయి నూటపదారులు బహుమతి నందిరఁట. నిజ మారసినచో, నిత్యము మనకు వినవచ్చు సామాన్య జనుల సమాచారములె నవలల కంటె నద్భుతకథనము లగుచున్నవి!

౧

మొన్నటి సెలవుదినములు స్వస్థలమునఁ గడపుచుండఁగా, ఇరువదియేండ్లక్రిత మచటికిఁ గాపురము వచ్చిన సోమన్న యను నొక బీదబ్రాహ్మణునిసంగతి యాకస్మికముగ నాకు జ్ఞప్తికి వచ్చెను. వైదికమందుఁ గాని వ్యవహారకాండలోఁ గాని యాతని కంతగా ప్రజ్ఞ లేదు. క్రొత్తగ వచ్చిన తన కేమైన సాయము చేయుఁడని వేడుచుండువాఁడు. అతనిఁ జూచు కుతూహలమున నేనిపుడిలు వెడలితిని. పేరుగుఱుతులు చెప్పితిని గాని, వాని యునికియే యెవరు నెఱుంగరు! ఈనరాటవిలో వానిజాడ గానక నేను వెనుకకు మరలుచుండఁగా, ఒకపూర్వపరిచితుఁ డగపడెను. కొంత తడవాతఁ డాలోచించి, "జ్ఞాపకమువచ్చినది! మీరడిగే సోమన్న యిపుడు భాగ్యవంతు డయిన సోమశేఖర శాస్త్రియైనాఁడు! పెద్ద బజారు లోని పచ్చ మేడ వారిదే" అని నాకుఁ బ్రత్యుత్తర మిచ్చెను.

౨

ఉభయ కుశలోపరి: నా కోరిక మీఁద సోమశేఖరశాస్త్రి తన వృత్తాంత మిట్లు చెప్పెను. శాస్త్రి కథను శాస్త్రి నోటనే వినెదము:

"నేను పట్నం వచ్చిన కొత్తరికమందే తమరు గ్రామాంతరము దయచేశారు. ఈపట్నవాస కాపరమెట్లు గట్టెక్కనా అని బెంగపెట్టుకొనేవాణ్ని. అయినా దైవానుగ్రహంవల్లా, తమ బోటి గొప్పవారి ప్రాపకంవల్లా, క్రమేణా నాకు మంచి రోజులు సంక్రమించినవి. వుద్యోగం లేకున్న, వచ్చినమూడు మంత్రం ముక్కల వల్లనే పొట్ట పోసుకొని, పదివరహాల సొమ్ము వెనుక వేసుకున్నాను. ఈమేడ, పాతిక రూపాయిలు బాడుగ వచ్చే బజారులో కొట్లు, పది యకరాల మాగాణీ, చేతిలో తిరిగే యీ నాలుగు డబ్బులు,– ఇవన్నీ నాకష్టార్జితమే!

"ఈఆస్తి పలుకు బళ్లు నా కెట్లు వచ్చిన వనా మీప్రశ్న? మొదలు నా కింగ్లీషు రాదని, సంస్కృతం చదవలేదని, తమకు తెలియనే తెలుసును. చిన్ననాటి పనసే మరచిపోయాను. సంధి మంత్రమైనా సరిగా రాక, సంసారం గడుపుకొందామని పుట్టెడాశతో పట్నం జేరాను. ఇటు లౌక్యానికీ అటు వైదీకానికీ చెడ్డ నన్నెవ రక్కడమాత్రం కనిపెట్టుతారు? అయినా చెప్ప వద్దూ, యిప్పటివలె గాక ఆ రోజులలో బ్రాహ్మణభక్తి యెక్కువగా వుండేది. కనుకనే నాకు వచ్చిన పుణ్యాహవాచన విఘ్నేశ్వర పూజలవల్లే రోజు గడచి పోయేది. యిప్పటివలె తెలుగు మీరని బ్రాహ్మలు కోమట్లు మొదలయినవాళ్లయిళ్లల్లో, శుభాశుభాలకు రోజూ నాలుగు శేర్ల బియ్యం, పావలా డబ్బులకు తక్కువ గాకుండా కళ్ల బడేవి. ఇందుకు వుపరిగా, ఏ సత్రంలోనో సమారాధనలోనో సుష్ఠుగా వేళకు భోజనం దొరికేది. ఏపెండ్లో, పేరంటమో యింటిదానికి కలిసి వచ్చేది. అవి పైగా మహారాజురోజులు, వస్తువులకు ధరలు వుండేవి. ప్రతినిత్యము మా యింటికి వచ్చిపడే బియ్యపు రాసులు, కాయ గూరలు, బీరుపోకుండా, బజారుధరల కమ్మివేసి, సోమిదేమమ్మ సొమ్ము చేసేది!

౩

"సొమ్ముతోనే గదా సర్వం వున్నది. కనుకనే ఆ రోజులలో, మారుమూల చుట్టాలకు కూడా సోమన్న ఆప్తబంధువై పోయాడు! స్వశాఖ వాళ్లకేకాదు, వైదీక బృందానికంతా అతడు అండగా వున్నాడని అందరు అనుకునేవారు. ఇంతలో భూములకు ధరలు పడిపోవడం బ్రాహ్మణాళ్లకు వుద్యోగాలు బందు గావడం, తటస్థ మయినది. మెటిక్లేషను మెట్టు దాటనివాళ్లు

దాటినవాళ్లు, తండోపతండాలుగా వచ్చి బ్రాహ్మణపిల్లలు సోమన్న శరణు జొచ్చేవాళ్లు. ‘ఆర్థికదుః స్థితి వస్తే వచ్చింది గాని, బ్రాహ్మణార్థాల కేమీ కరువు రాలేదర్రా! అని అభయహస్త మిచ్చి, ప్రతిపిల్ల వాడికీ యేదో కాస్త ముట్టచెప్పించే వాణ్ని. మీ రను కొనే బ్రాహ్మణ నిరుద్యోగసమస్యకు నాకు తోచిన సమాధాన మిదే!

“ఇప్పుడు సోమన్న యేకాకి గాడు. తాను విద్య నేర్వనప్పటికీ, చుట్టూ చేరిన బ్రాహ్మణ పిల్లకాయల కాతడు పెద్ద గురువే! తలిదండ్రులు చిన్నప్పుడు నాకు పెట్టిన పేరు ‘సోమన్న’ ముక్కు కోసిన మొగంలా గున్నదని చెప్పి చమత్కారి శిష్యు డొకడు, దర్జాకు తగ్గట్టుగా, ‘సోమ శేఖర శాస్త్రి’ అని నాకు నామకరణం చేశాడు! పాతపేరు పోతే పోయింది గాని, నోరు నిండిన చక్కని క్రొత్తదొకటి సంప్రాప్త మయిందని సంతోషించాను. ఆ వేసంగిలో పెద్ద పద్దులు కొన్ని వసూలు చేసి, యీ పచ్చమేడ వేశాను. నాకొత్త పేరు లోకుల నోళ్లలో కొంత రాపాడుతుందనే, వీధి నాపరాతి మీద ‘సోమ శేఖర విలాసము’ అని విలాసం చెక్కించాను!

౪

“నా తాహతుకు తగ్గ నిష్ఠానియమా లిప్పు డేర్పరుచుకొన్నాను. నిత్య దేవ తార్చన తోపాటు, యిటీవల వైశ్వదేవం కూడా చేశాను. సన్న కారువాళ్ల యిళ్లకు పౌరోహిత్యానికి పోక, శిష్యులను పంపిస్తాను. గొప్ప వుద్యోగస్తులు, సంపన్న గృహస్థులును నారాకచేత తాము తరిస్తున్నామని తలస్తూ వుంటారు! ఆహితాగ్ని నవడంచేత పరులయింట విస్తరి వేయక నామర్యాద కాపాడుకొంటున్నాను. పట్నంలో యేవైదిక కార్యం జరిగినా సోమ శేఖర శాస్త్రికి పిలుపు రావలసినదే— అతనికి అథర్వంవల్లనో, అతని శిష్యుల వల్లనో, అదిసానుకూల పడవలసినదే— మాంసము తిన్నప్పటికీ, ముడుసులు మెడకు తగిలించుకొందురా? బ్రాహ్మణ ద్వేషం పెచ్చు పెరిగి పూర్వాచారాలు పరిహాసంచేసే యీ పిదప రోజులలోనయినా, బాహాటంగా బ్రాహ్మణ కర్మ విడిచిపెట్టివేశినవా డెవడయ్యా? కాబట్టి లోకంలో వెల తగ్గిపోని మావైదీకవృత్తి కెక్కడా నిత్యపంటే! గనుకనే యెంతకరువు కాలంలోనూ మాబోటి వాళ్లకు నిత్యకృత్యాల కెప్పుడూ లోటు లేదు— గుచ్చి గుచ్చి అడుగుతున్నారు గనుక గుట్టు చెపుతున్నాను— నా శిఫారసువల్ల నాలుగు డబ్బులు కళ్ల జూచిన బ్రాహ్మణముండావాడు, కృతజ్ఞతతో కొంచెమైనా నాచేత రాల్చకుంటాడా? అంతేగాని, మీరు సూచించేటట్టుగా, పట్నంలోని బ్రాహ్మణార్థా లన్నీ నేను గుత్తకు పుచ్చుకొని, భాగంపెట్టుమని భోక్తల ముందు చెయి జాపుతా నను కోకండి! విప్రధనం విషంతో సమానం!

“ఈ ఐశ్వర్యం శాశ్వత మనుకోక పేదబ్రాహ్మల కెన్ని విధాలనో సహాయం చేస్తూన్నాను. నాఆశ్రితులలో మంత్రాలు వచ్చిన వాళ్లు ఉదయాస్తమానాలు మాయింటివద్ద బ్రహ్మచారులకు స్మార్తం పాఠం చెప్పవలె. నావద్దిలోవుండే విద్యార్థులంతా ప్రాతఃకాలమే లేచి, స్నానసంధ్యానుష్ఠానాలు నెరవేర్చవలెను. మాయిల్లు వేదఘోషతో మారు మోగుతూ వుంటుంది. సాధు వనీ శ్రోత్రియు డనీ శాస్త్రికి మంచిపేరు వచ్చిందే గాని, మీ రనుమానపడ్డట్లు, అతనిదగ్గిరవుండే విద్యార్థులు ప్రొద్దున్నే కాఫీ యిడ్డెనలు కబళించి బ్రాహ్మణార్థాలకు తయా రయ్యే మోసగాళ్లు గారు లెండి!

౫

“ఇంక నాకొమాళ్ల సంగతి పదే పదే మీ రెందు కడిగి, నన్ను బాధిస్తారు? నేనువద్దన్నను, ఆడది మొండిపట్టు పట్టడంచేతనే, పెద్దవాడు మాయ యింగ్లీషు యిస్కూల్లో ప్రవేశించాడు. సౌఖ్యాలు మరిగిన వాళ్లకు చదువు లంటుతవా? అతగాడు, ప్రాజ్ఞత రాకముందే, సినిమా నాటకాలు పట్టుకు తిరుగుతూ, సప్త వ్యసనాలలోను కూరుకు పొయ్యాడు! రెండోవాడైనా బాగుపడతాడేమో నని స్మార్తం చెప్పిస్తే, వీడికి వంటబడ్డవి,—బీడీలు తాగడం, బేస్తుపేకాడడం! కల్పతరువువంటి శాస్త్రికడుపున కారుపిందెలు కాసినవే అని అభిమాను లంతా ఆశ్చర్యపడుతున్నారు! ఎంతటి వాళ్లకూ, పూర్వఫలం అనుభవింపక తీరదు గదా!

“ఈసోదె కేమిగాని, గొప్ప ప్రభువులు మీరు రావడంచేత, మా గృహం పావన మయింది! సమ

యానికి జ్ఞప్తికి వచ్చింది,— పెద్ద వకీళ్లయిన మీాసలహా నాకు కావలసి వచ్చినది" అనుచు శాస్త్రి లోపలికి నన్నుఁ గొనిపోయి బంగారు, వెండిసామాను లుండు పెద్దయినుప పెట్టె తాళముతీసి లోని కాగితములు రెండు చూపి, వాటిని గురించి నా యభిప్రాయ మడిగెను. ఏమున్నది? ఎక్కువ రాబడిపన్ను తప్పించు కొనుట, మారుటోరియంపాశము మెడకు రాకుండఁ జేసికొనుట,— వీనిని గుఱించియె వానిప్రశ్నములు! ఆ సందర్భమున సద్భావముతో నే జెప్పిన రహస్యాలోచనల విశేషములు వెల్లడిచేయుట మాన్యాయవాదుల మరియాదగాదు! దీనికేమి గాని, ఉన్నతపరీక్షలిచ్చిన యనుభవముగల వకీలునైనను, నేఁటికిని నా నెలరాబడిసంఖ్య పదులస్థానము దాటలేదె! ఇంక నేను గూడఁబెట్టిన సొమ్ము గుండుసున్నయె! కాని, నిరక్షరకుక్షి యైన యీబాపన సోమన్న, యీ కొలఁదికాలము లోనె వేలకొలఁది విలువగల యాస్తిని సంపాదించి, సౌఖ్యసంపదలతోఁ దులతూగు చున్నాఁడే! ఇట్టి వైపరీత్యములు సంఘటించుచున్న మాయవిధిని నాఁడు మరల మరల దూఱుచు నేనిలు సేరితిని!

